క్లుప్తంగా

నేటి నుంచి విర్డ్‌లో వైద్య శిబిరం



విర్డ్ ఆస్పత్రి

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆసుపత్రిలో ఈ నెల 24, 25 తేదీల్లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఈ శిబిరంలో పోలియో, అన్ని రకాల చేతి సమస్యలకు ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కర ఆనంద్ చికిత్స అందిస్తారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో నిర్ధేశించిన సేవలకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 83744 45108, 79016 95176కు సంప్రదించాలని కోరారు.

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

కొయ్యలగూడెం: గవరవరంలో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో రైతుల నుంచి విశేష స్పందన లభించిందని పశు వైద్యశాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రం వద్ద రైతు నాయకులు గోపిన గోపాలకృష్ణ, యాగంటి హరిబాబు శిబిరాన్ని ప్రారంభించి రైతులకు పశు వ్యాధుల నివారణకు ఔషధాలను పంపిణీ చేశారు. 40 మంది రైతులకు చెందిన 130 పశువులకు, సంబంధించి నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. అదే విధంగా 300కు పైగా మేకలు, గొర్రెలకు పాక్స్ వ్యాక్సిన్ వేశారు. దాదాపు 400 కోళ్లకు కొక్కర తెగులు రాకుండా ఉండటానికి టీకాలు వేశారు.

సామాజిక తనిఖీ



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చింతలపూడి: మండలంలోని ఎర్రగుంటపల్లి పొట్టి మాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విస్సంపల్లి బాబూరావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్ఆర్‌సీ టి.నందిని, జిల్లా రిసోర్స్ పర్సన్ డి.నాగభూషణం, యు.రాజశేఖర్ సామాజిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలకు మంజూరు చేసిన నిధుల వినియోగం, ఖర్చులు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల తరగతి గదుల నిర్వహణ పరిశుభ్రత భోజన శాల, వంట చేసే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



సమావేశంలో పాల్గొన్న షాపుల, అపార్ట్‌మెంట్ల యజమానులు

చింతలపూడి: పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారులు, అపార్ట్‌మెంట్ యజమానులు ఇళ్లకు, దుకాణాలకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రవీంద్ర నాయక్ విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దొంగతనాల నివారణకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. అపరిచితులు, అనుమానితులు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని చెప్పారు. అదే విధంగా ఇళ్లకు తాళాలు వేసుకుని శుభ కార్యాలకు, విహార యాత్రలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నేర నియంత్రణలో పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

నిత్య సహాయ మాత ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో గురువారం నిత్య సహాయమాత ఉత్సవాలు ఫాదర్ తంబి రుంజల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. సీఎస్ఐ చర్చి పాస్టర్ రాయిరాల ప్రకాష్ రావు, దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జి.అమ్మన్ రాజా, ఏలూరు అశోక్ నగర్ విచారణ కర్త ఫాదర్ ఇంజే పాల్ ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత చర్చి ప్రాంగణంలో పతాకాన్ని ఎగురవేశారు. ఆలయంలో దివ్య పూజ బలి నిర్వహించారు. భక్తులు, ఆర్‌సీఎం సంఘస్తులు, పెద్దలు, యువత, మరియదళ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

అంతా డిజిటల్ మయం



కిరాణా షాపులో డిజిటల్ పేమెంట్ చేస్తున్న బాలిక



అరటిపండ్ల వ్యాపారికి ఫోన్ పే ద్వారా నగదు చెల్లిస్తున్న వినియోగదారులు

- పట్టణాల నుంచి గిరిపల్లెలకు విస్తరించిన సాంకేతిక సేవలు
- సూపర్ మార్కెట్ నుంచి టీ కొట్టు వరకు డిజిటల్ లావాదేవీలు
- ఆన్‌లైన్ చెల్లింపులతో తీరిన చిల్లర కష్టాలు
- చేతిలో సెల్ ఉంటే చాలు అన్ని కొనుగోళ్లూ సులభమే

బుట్టాయగూడెం: ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం డిజిటల్ లావాదేవీలు ఊపందుకున్నాయి. రోజురోజుకూ ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులపై ప్రజలు మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. డిజిటల్ ఇండియా దిశగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నగదు రహిత లావాదేవీలు కరోనా తర్వాత నుంచి మరింత జోరందుకున్నాయి. ప్రారంభంలో పట్టణాలకే పరిమితమైన డిజిటల్ సేవలు క్రమంగా గిరిజన గ్రామాలకూ విస్తరించాయి. చేతిలో సెల్‌ఫోన్ ఉండి అందులో ఫోన్ పే, గూగుల్ పే, యోనో వంటి యాప్‌లు ఉంటే చాలు కావాల్సినవి ఎంచక్కా కొనుగోలు చేయొచ్చు. బడ్డీ కొట్టులో సింగిల్ టీ నుంచి మాల్స్ వరకూ మార్కెట్‌లో కూరగాయలు మొదలుకొని జ్యూవెలరీ షాపులో బంగారం కొనుగోళ్ల వరకూ డిజిటల్ పేమెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయి. డిజిటల్ లావాదేవీలు అందుబాటులోకి వచ్చాక వ్యాపార దుకాణాల్లో చిల్లర కష్టాలు తీరాయి. అన్ని షాపుల వద్ద స్కానర్లు అందుబాటులో ఉండడంతో డిజిటల్ లావాదేవీల ద్వారా సొమ్ములు చెల్లిస్తున్నారు.

గిరిజన గ్రామాల్లోనూ డిజిటల్ లావాదేవీలు

కరోనాకు ముందు పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ చెల్లింపులు క్రమంగా గిరిజన గ్రామాలకు సైతం విస్తరించాయి. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా చిన్న చిన్న షాపుల్లో సైతం స్కానర్లు ఏర్పాటు చేసి సొమ్ములు చెల్లిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన మండలాలైన బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని మారుమూల గ్రామాల్లో సైతం తోపుడు బండ్లు, గంపలపై పండ్లు అమ్మే చిరు వ్యాపారులు, సైకిల్‌పై అరటి పండ్ల వ్యాపారం చేసేవారు కూడా డిజిటల్ లావాదేవీల ద్వారా వ్యాపారం సాగిస్తున్నారు. తక్కువ సమయంలో సురక్షితమైన చెల్లింపులు జరగడంతో వీటికి ఆదరణ లభిస్తుంది. కిరాణా, నిత్యావసర సరుకులు, పెట్రోల్, కేబుల్ రీచార్జ్, విద్యుత్ బిల్లులు, గ్యాస్ బిల్లులతో పాటు రుణాల చెల్లింపులో కూడా వీటిని వినియోగిస్తున్నారు. ఆఖరికి గిరిజన గ్రామాల్లో నిర్వహించే వారాంతపు సంతల్లో ఆన్‌లైన్ పేమెంట్లు నిర్వహిస్తున్నారు.

తీరిన చిల్లర సమస్య



డిజిటల్ లావాదేవీలతో చిల్లర కష్టాలు తీరాయి. గతంలో రూ. 5 లేదా రూ. 10 చేసి చెల్లింపులకు రూ. 100 నోటు ఇస్తే చిల్లర ఇచ్చేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. ఆన్‌లైన్ చెల్లింపులతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. నేను రోజుకు రూ. 2000 అరటి పండ్ల వ్యాపారం చేస్తే అందులో రూ.1800 ఆన్‌లైన్‌లో ఫోన్‌పే స్కానర్ ద్వారా వస్తుంది. కేవలం రూ. 200 మాత్రమే నగదు రూపేణా చేతికి వస్తుంది. ఈ విధానమే బాగుంది.
–గడ్డపల్లి మణికంఠ, అరటి పండ్ల వ్యాపారి, బుట్టాయగూడెం

చెల్లింపులు సులభతరం



డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత చెల్లింపులు సులభతరం అయ్యాయి. మాకు చిల్లర, చొకబేరాల బెడద తప్పింది. చేతితో నగదు చెల్లించనవసరం లేదు. చెల్లింపులో జవాబుదారీ తనం ఉంది. వినియోగదారుడికి, మాకు ఈ విధానం ఎంతో సౌకర్యంగా ఉంది. అనవసరమైన ఖర్చులు తగ్గాయి. క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేయడం తేలికైంది.
–గుడివాడ రామ గంగాధర్, వ్యాపారి, కృష్ణాపురం

జాగ్రత్తలు తప్పనిసరి



డిజిటల్ చెల్లింపులతో అవసరమైన జాగ్రత్తలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలి. సైబర్ నేరాలపై చైతన్యవంతం కావాలి. ఫోన్‌పే చెల్లింపు సమయంలో సీక్రెట్ కోడ్ ఇతరులకు ఇవ్వొద్దు. తెలియని వ్యక్తులు, బ్యాంక్ సిబ్బంది పేరిట ఫోన్ కాల్స్ వస్తే స్పందించొద్దు. ఒకవేళ స్పందించినా ఓటీపీ నంబర్లు చెప్పొద్దు.
–డి.దుర్గా మహేశ్వరరావు, ఎస్సై, బుట్టాయగూడెం

ఇసుక ర్యాంపు పరిశీలన



పట్టిసీమ ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో ఎంవీ రమణ

పోలవరం రూరల్: మండలంలోని పట్టిసీమలో ఏర్పాటు చేసే ఇసుక ర్యాంపు ప్రాంతాన్ని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ గురువారం పరిశీలించారు. బోట్‌మన్ సభ్యులతో సమావేశం నిర్వహించి ఇసుక తీసుకొచ్చే విధానాన్ని వివరించారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఇసుక ర్యాంపు ప్రారంభించాల్సి ఉందన్నారు. పడవల ద్వారా ఇసుక తీసుకురావాలన్నారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ర్యాంపు నిర్వహించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ర్యాంపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈమె వెంట డిప్యూటీ తహసీల్దార్ కంభంపాటి శ్రీను ఉన్నారు.

సారా నిందితుల అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

కొయ్యలగూడెం: నాటు సారా కలిగి ఉన్న వ్యక్తులను, విక్రయించి, తప్పించుకు తిరుగుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ జి.సునీల్‌కుమార్ గురువారం పేర్కొన్నారు. బయ్యనగూడెం గ్రామానికి చెందిన మార్గాన్ని వీర వెంకయ్య ఐదు లీటర్ల నాటు సారాని కలిగి ఉండగా పట్టుకున్నామని అదే విధంగా లక్ష్మీనారాయణదేవిపేట గ్రామానికి చెందిన బి.రాంపండు అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై ఇరవై లీటర్ల నాటు సారా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అంకాలగూడెం గ్రామానికి చెందిన పాత ముద్దాయిలు పీతల శ్రీనివాసరావు, గంజి రమేష్, కె.అనురాధలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎల్.శ్రీనివాసులు, పి.రమ్యదుర్గ, కె.సత్యనారాయణ, ఎ.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుప ముక్కలు దొంగిలిస్తున్న బాలుడి పట్టివేత

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై పలు అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇనుప ముక్కలను దొంగిలించి, పాత ఇనుప సామాన్ల దుకాణంలో విక్రయిస్తున్న ఒక బాలుడిని దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. ఇనుప ముక్కలను గోనె సంచిలో తీసుకెళుతుండగా స్థానిక టోల్‌గేట్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాలుడిది కామవరపుకోట మండలం ఈస్టు యడవల్లిగా చెబుతున్నారు.

యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్



కామవరపుకోట: నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్సై చెన్నారావు



జంగారెడ్డిగూడెం: బోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు



చింతలపూడి: నేతాజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కామవరపుకోట: యువతకు స్ఫూర్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని తడికలపూడి ఎస్సై టి.చెన్నారావు అన్నారు. గురువారం తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై చెన్నారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం సుభాష్ చంద్రబోస్ ఎనలేని కృషి చేశారని, అయనను ఆదర్శంగా తీసుకుని నేతాజీ నూరు పోసిన దేశభక్తిని అందిపుచ్చుకొని ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేయాలని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ స్వామి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ జయంతి

జంగారెడ్డిగూడెం: దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో అనేక మంది ఆత్మార్పణలు చేశారని, వారిలో సుభాస్ చంద్రబోస్ పోరాటం ప్రత్యేకమైనదని వీహెచ్‌పీ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ అన్నారు. సుభాష్‌చంద్రబోస్ జయంతిని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం తీసుకురావడానికి అనేకమంది పోరాట యోధులు తన ధన మన ప్రాణాలను అర్పణ గావించి భారత మాతను దాస్య శృంఖలాల నుంచి విడిపించారన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు కొంచాడ దుర్గాప్రసాద్, బీకే విశ్వనాథ్, భూపతి దేవ్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు తిప్పాభట్ల రామకృష్ణ, మృత్యుంజయ శర్మ, సిద్ధ రాంబాబు, సాయి బ్రహ్మం, రమణ, బ్రహ్మజీ, సుబ్బరామశర్మ పాల్గొన్నారు.

బ్రిటీష్ వారి గుండెల్లో దడ పుట్టించిన మహనీయుడు నేతాజీ

చింతలపూడి: బ్రిటిష్ వారి గుండెల్లో దడ పుట్టించిన మహనీయుడు, గొప్ప పోరాట పటిమ కలిగిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర కుమార్, దేవానందం, హసీమ, బి.శ్రీనివాసరావు, పోలయ్య, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



కొయ్యలగూడెం: నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు గురువారం కన్నాపురం రోడ్డులోని లైబ్రరీలో నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలను జల్లి నివాళులర్పించారు. ఆజాద్ హిందు ఫౌజ్ వ్యవస్థాపకులని, నేతాజీకి జయంతిలే కానీ వర్ధంతి లేని మహనీయుడని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, రీడర్స్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో అధికారి

బుట్టాయగూడెం: పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ విధిగా భద్రతా నియమాలు పాటించాలని ఎంవీఐ ఎస్ఎస్ రంగనాయకులు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద గురువారం ఆటో యూనియన్, మ్యాక్స్ క్యాబ్ యూనియన్, టాక్సీ స్టాండ్ ఆధ్వర్యంలో మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు అంధకారంలోకి వెళ్లాయన్నారు. వీటి నివారణకు జాగ్రత్తలు పాటించడమే పరిష్కారమని తెలిపారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు అధిక లోడుతో ప్రయాణికులను ఎక్కించొద్దన్నారు. అలాగే ఆటోకు కుడి, ఎడమ వైపున ప్రయాణికులను కూర్చో బెట్టకుండా సురక్షితమైన ప్రయాణం సాగించాలన్నారు. అసిస్టెంట్ ఎంవీఐ వై.సురేష్‌బాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, అధిక స్పీడ్‌తో, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై కె.సోమరాజు, కొండేపాటి రామకృష్ణ, యూనియన్ నాయకులు తీగల గోపాలకృష్ణ, జాలపర్తి నాగు, సయ్యద్ బాజీ, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కే గౌస్

వేలేరుపాడు: మండలంలోని చాగరపల్లిలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా నాయకుల సమావేశం కారం సత్యవతి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ వేలేరుపాడు మండలంలో 41.15 కాంటూరులో ఉన్న పోలవరం ముంపు గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి, 45.72 కాంటూరులో నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఎప్పుడు ఇస్తారో, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇవ్వలేదన్నారు. చాగిరిపల్లి, కొర్రాజులగూడెం, సుద్దగుంపు, నడిమి గొమ్ము కాలనీ, తూర్పు మెట్ట, పడమర మెట్ట, బోళ్లపల్లి, ఎడవెల్లి, చిట్టెం రెడ్డిపాలెం, యర్రతోగు, సిద్ధారం, చింతలపాడు, కేకే పాకలు పరిహారం రాని ఇళ్లు, టేకూరు, కాచారం, బుర్రతోగు, భూదేవి పేట వసంతవాడ, గుంపెన గూడెం, మద్దిగట్ల, శివకాశి పురం, పూచిరాల కాలని తదితర గ్రామాలను 2022 గోదావరి వరదలను బట్టి మండలాన్ని యూనిట్‌గా తీసుకొని, ఆర్ఆర్అండ్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు ప్రభావం ఉన్న మేడిపల్లి, రామవరం గ్రామ పంచాయతీల 18 గ్రామాలను పోలవరం ముంపులో తీసుకొని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, కట్టం వీరాస్వామి, కట్టం ముత్యాలరావు, కట్టం రాంబాబు, కారం సత్యవతి, తొడం సీత, మడివి కన్నమ్మ, సోడే విజయ, కట్టం రత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: గతంలో మంజూరైన ప్రతి పనిని పూర్తి చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కమిషనర్ కేవీ రమణ అన్నారు. జంగారెడ్డిగూడెం 9వ వార్డు పర్రెడ్డిగూడెంలో అభివృద్ధి పనులను చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో ప్రాధాన్యత వారీగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గతంలో మంజూరై ఎన్నికల కోడ్ సందర్భంగా నిలిచిన పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు కమిషనర్ కేవీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పర్రెడ్డిగూడెంలో 200 మీటర్ల డ్రెయిన్, మూడు కల్వర్టులు, సుమారు రూ.11 లక్షల గ్రాంట్‌తో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, కంచర్ల విష్ణు, కంచిమర్తి ప్రకాష్, తమ్మిశెట్టి సాయినాథ్, కాటం అనిల్ పాల్గొన్నారు.

కాదేదీ ఆక్రమణకు అనర్హం



కళాశాల గేటు పక్కనే ఏర్పాటు చేసిన బడ్డీ కొట్టు

జంగారెడ్డిగూడెం: కాదేదీ ఆక్రమణకు అనర్హం అన్న చందంగా డిగ్రీ కళాశాల గేటు పక్కనే ఆక్రమించి బడ్డీ కొట్టు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటు పక్కనే రాత్రికి రాత్రే ఒక బడ్డీ కొట్టు ఏర్పాటు చేశారు. దీనిపై అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ కళాశాలకు వెళ్లే రోడ్డుకు ఆనుకుని కళాశాల ప్రహరీ గోడ ఉంటుంది. ఈ గోడకు ఆనుకుని ఉన్న కొద్ది పాటి ఖాళీ స్థలాన్ని ఆక్రమించి బడ్డీ కొట్టు ఏర్పాటు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ బడ్డీ కొట్టు ఏర్పాటుకు ఒక వ్యక్తి దందా నిర్వహిస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిగ్రీ కళాశాల గేటు పక్కనే బడ్డీ కొట్టు ఏర్పాటు చేయడంతో కళాశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణలు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

తెగుళ్ల నివారణలో డ్రోన్ల సాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చింతలపూడి: డ్రోన్ల సాయంతో ప్రకృతి వ్యవసాయంలో పురుగులు, తెగుళ్ల నివారణ చేపట్టొచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణులు మరికంటి గోపాలకృష్ణ తెలిపారు. రాఘవపురం, మల్లయ్యగూడెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు గురువారం డ్రోన్ల సహాయంతో పంటలపై కషాయాలు, ద్రావణాలను పిచికారీ చేయడంపై అవగాహన కలిగించారు. ఈ విధానం రైతులకు గణనీయంగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ విధానంలో పెద్ద ఎత్తున పంటలకు పిచికారి చేయడానికి సమయం తక్కువగా పడుతుందన్నారు. దీంతో సమయం ఆదా అవుతుందన్నారు. రైతులు భౌతికంగా శ్రమించాల్సిన అవసరం ఉండదని, అన్ని మొక్కలకు సమానంగా ద్రావణం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

జంగారెడ్డిగూడెం: జనవరి 25వ తేదీ ఓటర్స్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వంలో పోటీల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ, తృతీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్స్ డేను పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వంలో పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో విజేతలు అనంతరం ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఐ.కిరణ్ ప్రథమ స్థానం, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె.భాను తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.మధు, అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, జి.వెంకటలాల్, బి.అశోక్, వి.హనుమంతరావు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.